ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తే ఊరుకోం

- సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సౌత్ జిల్లా 4వ మహాసభలో తమ్మినేని వీరభద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రపంచం కమ్యూనిస్టుల వైపు చూస్తోందని, భావి ప్రపంచానికి కమ్యూనిస్టులే దిక్సూచి అనే సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. కమ్యూనిస్టులకు భవిష్యత్తు ఉందా?.. అని కొందరు ప్రశ్నిస్తారు గానీ కమ్యూనిస్టులు లేకుండా ప్రపంచానికి భవిష్యత్తు ఉందా? అనే పరిస్థితి వచ్చిందని తెలిపారు. సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సౌత్ జిల్లా నాలుగో మహాసభ పాతబస్తీ హుస్సేని అలంలోని కామ్రేడ్ సయ్యద్ ఇబ్రహీంనగర్ పాల్కీ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఘనంగా ప్రారంభమైంది. ముందుగా పురాణపూల్ నుంచి పాల్కిగార్డెన్ వరకు భారీర్యాలీ నిర్వహించారు. దారి పొడవునా ఎర్రజెండా తోరణాలు స్వాగతం పలికాయి. మహాసభలకు ముందు పార్టీ జెండాను ఆవిష్కరించారు. కామ్రేడ్ సీతారామ్ ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించి మహాసభలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ.. ఒకనాడు అమెరికా చుట్టూ తిరిగిన వారే ఈరోజు చైనా వైపు చేరుతున్నారని తెలిపారు. గాజాకు మద్దతిస్తూ ఆయుధ సామాగ్రి సరఫరా చేస్తూ పాలస్తీనా వంటి ఒక పేద దేశంపై యుద్ధం చేయడంతో చిన్నపిల్లలు సైతం బాంబుల ధాటికి ధ్వంసమైపోతున్న అరాచకత్వాన్ని చూస్తున్నామన్నారు. దీన్ని ప్రపంచ దేశాలు.. ప్రజలు ఖండిస్తున్నారన్నారు. బంగ్లాదేశ్‌లో అక్కడి విద్యార్థుల నాయకత్వంలో జరిగిన ఉద్యమం దేశ అధ్యక్షున్ని పారిపోయే పరిస్థితికి తీసుకువచ్చిందన్నారు. శ్రీలంకలో జరుగుతున్న రాజకీయ సంక్షోభం తీవ్రస్థాయికి పోవడంతో అక్కడి అధ్యక్షులు కనిపించకుండా పోయాడన్నారు. అక్కడి ప్రజలు వామపక్ష నాయకుడిని అధికారానికి తెచ్చిన పరిస్థితిని మనం చూస్తున్నామని చెప్పారు. ప్రపంచమంతా ఒకవైపు పోతుంటే మనదేశంలో బీజేపీ, ఎన్డీఏ ప్రభుత్వాలు దేశాన్ని అనాగరిక సంస్కృతిలో నెట్టేయ్యడానికి ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఒకవైపు హిందుత్వ శక్తులతో వెనుకబడ్డ తరగతులపై బహిరంగదాడులు చేయిస్తూ.. ప్రజల్లో గొడవలు రేపుతోందని అన్నారు. మరోవైపు నిరుద్యోగ సమస్యల్లో నెట్టేస్తూ ప్రజలకు కనీస వసతులకు దూరం చేస్తున్నారన్నారు. రాజ్యాంగంలోని ముఖ్యమైన చట్టాలను మారుస్తూ హిందుత్వ రాజ్యాంగాన్ని ముందుకు తెచ్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. గతంతో పోలిస్తే బిజెపికి ఓట్ల శాతం పూర్తిగా తగ్గింది గానీ కొన్ని ప్రాంతీయ పార్టీలు మద్దతు ఇవ్వడంతో ఎన్‌డిఎ కూటమిగా ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగిందని అన్నారు. బీజేపీకి మద్దతిస్తున్న ప్రాంతీయ పార్టీలు భవిష్యత్తులో స్థానం లేకుండా పోయే పరిస్థితి వస్తుందనేది గమనించడం లేదన్నారు. ప్రాంతీయ అధికార పార్టీలను నాశనం చేయడమే బీజేపీ లక్ష్యంగా ఎంచుకున్న విషయం అని వారు గ్రహించాలని అన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీలలో ఏ ఒక్కదాన్ని అమలు చేయడం లేదన్నారు. ప్రజా సమస్యలను పక్కకు నెట్టి మూసీ నది సుందరీకరణ పేరుతో రాష్ట్రాన్ని గందరగోళ పరుస్తున్నారని విమర్శించారు. మూసీనది సుందరీకరణ అంటే పేదలను అక్కడి నుంచి తరిమేసి వాళ్ల ఇల్లు వాకిలి కూల్చేయడం సుందరీకరణ కాదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యాపార కేంద్రాల కోసం పేదల భూములను సేకరించడం అన్యాయమన్నారు. గతంలో ఉన్న టీడీపీ, బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన కంటే మెరుగ్గా ఈ పాలన ఉండాలని కోరుకుంటున్నామన్నారు. భవిష్యత్తులో ప్రజా వ్యతిరేక విధానాలకు అమలు చేస్తే సిపిఎం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సౌత్ కమిటీ కార్యదర్శి మహ్మద్ అబ్బాస్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నరసింహారావు పాల్గొన్నారు.

విద్యార్థుల మరణాలు పట్టని సర్కార్

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్ బ్యూరో : రాష్ట్రంలోని ప్రభుత్వ వసతి గృహాల్లో నిత్యకృత్యంగా మారిన విద్యార్థుల మరణాలంటే ప్రభుత్వానికి లెక్కలేకుండా పోయిందని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను శనివారం ఆమె పరామర్శించారు. అనంతరం కవిత మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతినెలా ముగ్గురు చొప్పున ప్రభుత్వ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు విషాహారం తిని మృత్యువాత పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 11 నెలల కాంగ్రెస్ పాలనలో 42 మంది విద్యార్థులు మరణించారని గుర్తు చేశారు. చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ ముఖ్యమంత్రి వద్దే ఉండటంతో సరైన సమయం కేటాయించడం విమర్శించారు. వెంటనే విద్యాశాఖపై సమీక్ష నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

విలేకరులతో మాట్లాడుతున్న కెటిఆర్

జైల్లో ఉన్న రైతుల కుటుంబాలు భయపడొద్దు

- మీ వెనుక కెసిఆర్ ఉన్నారు : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డికి, చేయని తప్పునకు జైల్లో ఉన్న 30 మంది అమాయక రైతుల కుటుంబాలకు ఒకటే చెబుతున్నాం.. మీరు భయపడాల్సిన అవసరం లేదు. మీ వెనుక కెసిఆర్ ఉన్నారు. తప్పకుండా న్యాయం, ధర్మం గెలుస్తుంది" అని ఎమ్మెల్యే, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. శనివారం చర్లపల్లి జైలులో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి కెటిఆర్ పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పేద, గిరిజన, బలహీనవర్గాల రైతుల తరపున పోరాటం చేసిన పాపానికి నరేందర్ రెడ్డి జైలు పాలయ్యారని అన్నారు. రేవంత్ రెడ్డి కక్షపూరిత వైఖరి కారణంగా, చేయని తప్పునకు జైల్లో నరేందర్ రెడ్డి శిక్ష అనుభవిస్తున్నారని తెలిపారు. సంగారెడ్డి జైలు నుంచి చర్లపల్లి జైలు వరకు తప్పు చేయని అమాయకులు జైల్లో ఉన్నారని.. కొడంగల్ నుంచి కొండారెడ్డిపల్లె వరకు అరాచకాలు చేస్తున్న దుర్మార్గులు గద్దెనెక్కి కూర్చున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొడంగల్‌లో అర్ధరాత్రి ఇళ్లపై పడి మహిళలు, పిల్లలపై అరాచకాలు చేస్తూ పేద రైతుల భూములు గుంజుకుంటున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి సొంత ఊరు కొండారెడ్డిపల్లిలో మాజీ సర్పంచ్ సాయిరెడ్డి సిఎం కోసం మొన్నటి ఎన్నికల్లో పని చేశారని, కానీ ఆయనపై పగబట్టి ఆయన ఇంటికి అడ్డంగా గోడకట్టి తోవ లేకుండా చేశారని అన్నారు. ఆ క్షోభ, అవమానంతో ఆయన ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూ కుంభకోణాలు, ఫార్మా విలేజ్ పేరుతో దౌర్జన్యాలు, పేద, గిరిజన రైతుల కుటుంబాల మీద అర్ధరాత్రి బందిపోట్ల మాదిరిగా పోలీసులు దాడి చేస్తున్నారని తెలిపారు. అమాయక రైతులను నాలుగు రోజులు జైల్లో పెట్టొచ్చు.. కానీ ఆయనకు మళ్లీ రాజకీయ జీవితం లేకుండా చేసే బాధ్యత మీ మీద ఉందన్నారు. ఆయన వెంట మాజీ మంత్రులు మహమ్మద్ అలీ, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, ఉప్పల్, మేడ్చల్ నియోజకవర్గం ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

హెచ్‌సియులో చీఫ్ వార్డెన్ వేధింపులు

- విద్యార్థుల నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో కొద్ది కాలంగా విద్యార్థులను ఫైన్‌ల పేరుతో వేధిస్తున్న చీఫ్ వార్డెన్ సువర్ శశి రానాపై విద్యార్థులు ఒక్కసారిగా తిరగబడ్డారు. చాలా కాలంగా విద్యార్థుల హాస్టళ్ల తనిఖీల పేరుతో చీఫ్ వార్డెన్ వేధింపులకు గురి చేస్తున్నారు. వార్డెన్ వ్యవహార శైలిపై విద్యార్థులు విసుగుచెందారు. ఈ విషయంపై ఇటీవల ఆందోళన కూడా చేశారు. శనివారం ఉదయం మళ్లీ తనిఖీల పేరుతో వార్డెన్ విద్యార్థుల హాస్టల్‌లోకి ప్రవేశించారు. దాంతో ఆగ్రహానికి గురైన విద్యార్థులు ఆయనను చుట్టుముట్టారు. చీఫ్ వార్డెన్ తమను వేధిస్తున్నారని, ఆయనకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేస్తూ.. ఘెరావ్ చేశారు. చేసేదేమీ లేక ఆయన వెనుతిరిగారు. అయినా విద్యార్థులు నిరసన చేపట్టారు. విషయం తెలుసుకున్న గచ్చిబౌలి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థులకు నచ్చజెప్పడంతో శాంతించారు.

ఫార్మాసిటీ కాదు.. ఇండస్ట్రియల్ కారిడార్

- కొడంగల్ అభివృద్ధి నా బాధ్యత
- వామపక్ష నేతలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొడంగల్‌లో ఏర్పాటు చేసేది ఫార్మాసిటీ కాదనీ, ఇండస్ట్రియల్ కారిడార్ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆ నియోజవర్గ ఎమ్మెల్యేగా ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం తన బాధ్యత అని అన్నారు. యువత, మహిళలకు ఉపాధి అవకాశాలను కల్పించడమే తన ఉద్దేశమని వివరించారు. సొంత నియోజకవర్గ ప్రజలను తానెందుకు ఇబ్బంది పెడతానని చెప్పారు. లగచర్ల ఘటనపై శనివారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని వామపక్ష నేతలు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ కొడంగల్‌లో కాలుష్య రహిత పరిశ్రమలనే ఏర్పాటు చేస్తామని వివరించారు. భూసేకరణ పరిహారం పెంపును పరిశీలిస్తామని చెప్పారు. ఈ నెల 21న లగచర్ల ప్రాంతంలో వామపక్ష నేతలు పర్యటించిన విషయం తెలిసిందే. ప్రజలు, రైతులను కలిసి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన వారిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్య పద్మ, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె రమ, నాయకులు ఎస్ఎల్ పద్మ, ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వనం సుధాకర్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ నాయకులు పాపయ్య, ఆరెస్పీ రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు, ఎస్‌యూసీఐ(సీ) రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ మురహరి, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్‌రాజా, సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న ఉన్నారు. అనంతరం మీడియా సెంటర్‌లో వారు మాట్లాడారు.

పరిశ్రమల కోసం వ్యవసాయ భూములు తీసుకోవద్దు : తమ్మినేని

లగచర్లలో ఫార్మాసిటీని పెట్టడం లేదనీ, ఇండస్ట్రియల్ పార్క్ మాత్రమే పెడుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు. ఇండస్ట్రియల్ పార్క్ కోసం అయినా పంటలు పండే భూములను రైతుల నుంచి తీసుకోవద్దని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో లగచర్లలో పర్యటించి అక్కడి పరిస్థితులను పరిశీలించి నివేదికను సీఎంకు అందజేశామన్నారు. అక్కడ శాంతియుత వాతావరణాన్ని ఏర్పాటు చేసేందుకు సిఎం సానుకూలంగా స్పందించారని చెప్పారు. అక్కడ వరికోత కోసేందుకు అనుమతివ్వాలని కోరారు. సిఎం వెంటనే స్పందించి వరి కోత కోసేందుకు అనుమతివ్వాలంటూ కలెక్టర్‌ను ఆదేశించారని అన్నారు. భూసేకరణలో బీడు భూములతోపాటు పంట భూములున్నాయని వివరించారు. కాలుష్యం కాని ఫార్మాసిటీని ఏర్పాటు చేస్తామంటూ సిఎం హామీ ఇచ్చారని చెప్పారు. అక్కడ సీలింగ్, దొరల భూములున్నాయని గుర్తు చేశారు. లగచర్ల వద్ద మహిళలపై పోలీసులు దారుణంగా ప్రవర్తించారనీ, దాడిని ఖండిస్తున్నామని అన్నారు. స్వార్థ రాజకీయాల కోసం కుట్రల కోసం రైతులకు అన్యాయం చేయొద్దని కోరారు. ఆ ప్రాంతంలో వామపక్ష పార్టీల తరపున మరోసారి పర్యటిస్తామన్నారు.

గిరిజనులపై కేసులను ఎత్తేయాలి : కూనంనేని

లగచర్ల ఘటనపై విచారణ చేపట్టి అమాయకులైన గిరిజనులపై నమోదు చేసిన కేసులను ఎత్తేయాలంటూ సిఎం రేవంత్‌రెడ్డిని కోరామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. లగచర్లలో జరిగిన ఘటనపై ప్రభుత్వం విచారణ చేపట్టొచ్చునీ, కానీ గిరిజనులపై ఎలాంటి కేసుల్లేకుండా విడుదల చేయాలని కోరామన్నారు. దానికి సీఎం రేవంత్‌రెడ్డి కూడా అంగీకరించారని చెప్పారు. విషపదార్థాలు వెదజల్లే ఫార్మా కంపెనీలను జనావాసాల మధ్య నెలకొల్పవద్దని కోరారు. జనావాసాల్లో ఫార్మాకంపెనీలను ఏర్పాటు చేస్తే వామపక్ష పార్టీలు అంగీకరించబోవని స్పష్టం చేశారు. మల్లన్నసాగర్ నిర్వాసితులకు ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో పరిహారం అందలేదని వివరించారు. రైతులు సంతోషపడేలా పరిహారం పెంచాలని సూచించారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డితో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

వామపక్ష పార్టీల డిమాండ్లు :

1.లగచర్ల ఫార్మా పరిధిలోని నాలుగు గ్రామాల్లో రైతులపై నిర్బంధకాండను నిలిపేయాలి. పోలీసు క్యాంపులను ఎత్తేయాలి.
2.రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తేయాలి. జైల్లో ఉన్న రైతులను బేషరతుగా విడుదల చేయాలి.
3.మహిళలపై అసభ్యంగా ప్రవర్తించిన పోలీసులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి.
4.లగచర్ల ఘటనపై సమగ్ర న్యాయ విచారణ జరపాలి. దోషులను గుర్తించి చర్యలు తీసుకోవాలి. అమాయకులను వదిలేయాలి.
5.రైతుల అనుమతి లేకుండా బలవంతంగా భూసేకరణ చేయొద్దు. వ్యవసాయానికి ఉపయోగపడే భూముల్లో ఫార్మా కంపెనీ ఏర్పాటును విరమించుకోవాలి.
6.నాలుగు గ్రామాల్లో వరికోత యంత్రాలకు అనుమతివ్వాలి. ఐకేపీ కేంద్రాలను ఏర్పాటు చేయాలి.
7.ఫార్మా కంపెనీకి పడావుగా ఉన్న కొడంగల్ దొరల సీలింగ్ భూములు 1,156 ఎకరాలను తీసుకునే విషయాన్ని పరిశీలించాలి.
8.2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతుల సమ్మతి లేకుండా భూములను తీసుకోవద్దు.
9.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలతోపాటు ఏడో గ్యారంటీ స్వేచ్ఛ, ప్రజాస్వామ్య పునరుద్ధరణ చర్యలు లగచర్లలో చేపట్టాలి. ప్రజలకు ధైర్యం ఇచ్చే విధంగా స్వేచ్ఛా వాతావరణం కల్పించాలి.

చిన్న కాళేశ్వరం ఎత్తిపోతలకు

రూ.571 కోట్ల కేటాయింపు

హైదరాబాద్ బ్యూరో : మంథని శాసనసభ నియోగవర్గం పరిధిలోని 63 గ్రామాలను సస్యశ్యామలం చేసే చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో మిగిలిపోయిన పనులను పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 2007లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు పనులు ఇప్పటిదాకా 75 శాతం పూర్తయ్యాయి. శనివారం ఎర్రమంజిల్‌లోని జలసౌధలో నీటి పారుదల, పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఐటి, పరిశ్రమల మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో ఉన్నతాధికారులతో సమీక్ష జరిగింది. చిన్న కాళేశ్వరం (ముక్తేశ్వర్) ఎత్తిపోతల పథకం పనులకు రూ.571.57 కోట్ల పరిపాలన అనుమతి లభించినట్టు సమీక్ష అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. మొత్తం 45 వేల ఎకరాలకు సాగునీరు, అర టిఎంసి నీటిని మంచినీటి సరఫరా కోసం వినియోగించనున్నట్టు ఆయన తెలిపారు. గోదావరి నుంచి అప్రోచ్ కెనాల్ ద్వారా నీటిని తరలించి కన్నెపల్లి వద్ద ఒకటో పంపుహౌజ్ ద్వారా 4.2 టిఎంసీల నీరు దిగువన రెండో పంపుహౌజ్‌కు నీరు సరఫరా అవుతుంది. మొదటి పంపుహౌజ్ సెకనుకు 600 క్యూబిక్ ఫీట్ల నీటిని ఎత్తిపోస్తుంది. అక్కడి నుంచి మందిరం చెరువు, ఎర్ర చెరువుకు నీటి సరఫరా జరుగుతుంది. మిగిలిన నీరు రెండో పంపుహౌజ్‌కు చేరుతుంది. కాటారంలో ఏర్పాటు చేసే రెండో పంపుహౌజ్ ద్వారా గారెపల్లి, పోలారం, తాండ్ర, యెల్లాపూర్, కొత్తపల్లి, రుద్రారం, ధన్వాడ, ఆదివారంపేట, గుమ్మలపల్లి, వీరాపూర్, గూడూర్ చెరువులకు గోదావరి జలాలు చేరతాయి. ఈ పథకంలో భాగంగా ఎర్ర చెరువు సామర్థ్యాన్ని పెంచనున్నారు. వరదకు తెగిపోయిన రుద్రారం చెర్వు గండిని పూడ్చి బలోపేతం చేసే పనులు కూడా పూర్తి కావచ్చాయి. రానున్న రెండేండ్లల్లో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసి చెరువుల ద్వారా సాగునీరు అందించాలని నీటి పారుదల శాఖ లక్ష్యంగా పెట్టుకుంది.ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చొరవతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఎత్తపోతల పథకాన్ని తక్షణం పూర్తి చేయాల్సిన ప్రాజెక్టుల జాబితాలో చేర్చినట్టు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

శ్రీరాంసాగర్ నీటితో 28 వేల ఎకరాల ఆయకట్టు

ప్రస్తుతం మంథని నియోజకవర్గంలో శ్రీరాంసాగర్ జలాలతో 28,800 ఎకరాలకు సాగునీరు అందుతోంది. డి-83 డిస్ట్రిబ్యూటరీ కెనాల్ ద్వారా గుండారం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు చేరుకుంటాయి. అక్కడి నుంచి 24 మైనర్ కాల్వల ద్వారా మొత్తం 28,800 ఎకరాలకు సాగునీరు అందేది. కాలక్రమేణా మైనర్లలో పూడిక చేరడం లాంటి పలుకారణాలతో నిర్దేశిత ఆయకట్టుకు నీరు అందడం లేదు. గుండారం చెరువు నుంచి మైనర్ల చివరి వరకు మరమ్మతులు జరిపి నీటి సామర్థ్యాన్ని పెంచాలని మంత్రి శ్రీధర్ బాబు శ్రీరాంసాగర్ ఇంజినీర్లను ఆదేశించారు.

మరో డిజిటల్ అరెస్ట్ స్కామ్ నుంచి ఎస్‌బిఐ రక్షణ

- చంద్రయాన్‌గుట్ట సిబ్బంది చొరవ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) తమ మరో ఖాతాదారున్ని డిజిటల్ అరెస్ట్ నుంచి కాపాడగలిగింది. హైదరాబాద్ చంద్రయాన్‌గుట్ట శాఖలోని సిబ్బంది చాకచక్యంగా ఖాతాదారుడి రూ.46 లక్షలను సైబర్ మోసం నుంచి రక్షించింది. ఎస్‌బిఐ లోకల్ హెడ్ ఆఫీసు హైదరాబాద్ మార్కెటింగ్, కమ్యూనికేషన్స్ ఏజిఎం జి రామక్రిష్ణ వెల్లడించిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఓ ప్రభుత్వ రంగ సంస్థలో ఉద్యోగ విరమణ పొందిన తమ ఖాతాదారుడు, ఆయన సతీమణి ఆర్‌టిజిఎస్ ద్వారా రూ.46 లక్షల బదిలీ కోసం వచ్చారు. వారి ఆందోళన తీరును గమనించిన సీనియర్ అసోసియేట్ బి ప్రవీణ్ తక్షణమే స్పందించి బ్రాంచ్ హెడ్ శివ కుమార్ వద్దకు తీసుకెళ్లారు. సిబిఐ వాళ్ల పేరుతో తమ కొడుకును రూ.100 కోట్ల ఓ కుంభకోణంలో అరెస్ట్ చేశారని.. ఆయన్ను విడుదల చేయడానికి నగదు డిమాండ్ చేశారని ఆ దంపతులిద్దరు మేనేజర్ వద్ద వాపోయారు. మూడు రోజులుగా వీడియో కాల్స్‌లో వారిని సైబర్ క్రిమినల్స్ వేధించారు. ఔరంగబాద్‌లోని ఓ ఐసిఐసిఐ బ్యాంక్ ఖాతా మిజాని ఎలక్ట్రాటెక్‌కు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. దీంతో వారు బ్యాంక్ శాఖకు రావడం వారి.. ఆందోళన గమనించిన సిబ్బంది భారీ స్కామ్ నుంచి తప్పించుకునేలా చేశారు. తమ కుమారుడితో ఫోన్లో మాట్లాడించడంతో పాటుగా సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కి ఫిర్యాదు చేయించారు. దీంతో ఆ దంపతులిద్దరు బ్యాంక్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఇదే తరహాలో ఇటీవల మహబూబ్‌నగర్ క్లాక్ టవర్ శాఖలోని సిబ్బంది ఓ ఖాతాదారున్ని రూ.4.20 లక్షల సైబర్ మోసం నుంచి కాపాడగలిగారు.

1 నుంచి ప్రజాపాలన విజయోత్సవాలు

- 4న పెద్దపల్లిలో యువత విజయోత్సవ సభ
- 4 వేల మందికి ఉద్యోగ నియామకపత్రాలు అందజేత
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డిసెంబర్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు రాష్ట్రమంతటా పండుగ వాతావరణం వెల్లివిరిసేలా ప్రజా పాలన విజయోత్సవాలు జరపాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నిర్ణయించారు. విజయోత్సవాల నిర్వహణకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు ఈ ఉత్సవాల్లో భాగస్వామ్యం కావాలని చెప్పారు. తొలి ఏడాదిలో ప్రభుత్వం సాధించిన విజయాలతోపాటు భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాల ప్రణాళికను ప్రజలకు వివరించాలని సూచించారు. శనివారం సెక్రటేరియట్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రజాపాలన-విజయోత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, వేం నరేందర్ రెడ్డి, శ్రీనివాసరాజు, సిఎస్ శాంతికుమారి, డిజిపి జితేందర్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. విజయోత్సవాల్లో భాగంగా వరంగల్లో ఈ నెల 19న మహిళా శక్తి సంఘాలతో ఏర్పాటు చేసిన సభ విజయవంతమైందని ముఖ్యమంత్రి అధికారులను అభినందించారు. ఈ నెల 30న మహబూబ్ నగర్‌లో ఏర్పాటు చేసే రైతు సదస్సుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రెండు రోజుల ముందు నుంచే.. రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని, వారికి అవసరమైన ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. రైతు రుణమాఫీ, రైతు భరోసాతో పాటు పంటల బీమా, సన్న వడ్లకు బోనస్.. రైతుల సంక్షేమమే ధ్యేయంగా తొలి ఏడాదిలో ప్రజా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అన్నారు. డిసెంబర్ 4వ తేదీన పెద్దపల్లి జిల్లాల్లో నిరుద్యోగ యువతతో విజయోత్సవ సభ జరపాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. అదే వేదికగా గ్రూప్ 4 తో పాటు వివిధ రిక్రూట్మెంట్ల ద్వారా ఎంపికైన 9 వేల మందికి నియామక పత్రాలు అందించేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఈ మూడు రోజుల పాటు హైదరాబాద్లో సెక్రటేరియట్ పరిసరాలు, ట్యాంక్ బండ్, నెక్లెస్ రోడ్ ప్రాంతమంతా తెలంగాణ వైభవం వెల్లివిరిసేలా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 9న సెక్రటేరియట్ ముఖద్వారం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఆ రోజు సాయంత్రం జరిగే ఈ వేడుకలకు తెలంగాణ ఉద్యమకారులను, మేధావులను, విద్యావంతులను, వివిధ రంగాల్లో ప్రతిభ సాధించిన వారందరినీ ఆహ్వానించాలని ముఖ్యమంత్రి సూచించారు. నియోజకవర్గానికో వెయ్యి మంది చొప్పున మహిళా శక్తి ప్రతినిధులను ఆహ్వానించి... లక్ష మంది తెలంగాణ తల్లుల సమక్షంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

అధికారులతో సమీక్షిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి

30న మహబూబ్‌నగర్‌లో 'రైతు సదస్సు'
వ్యవసాయ శాఖ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

ప్రజా ప్రభుత్వ విజయోత్సవాల్లో భాగంగాఈ నెల 30న మహబూబ్‌నగర్‌లో జరుగనున్న రైతు సదస్సును నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వ్యవసాయంలో వస్తున్న మార్పులపై రైతులకు అవగాహన కల్గించేలా మూడు రోజులపాటు కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. దీన్ని బహిరంగసభగా కాకుండా రైతులకు ఉపయోగపడేలా ఉండాలని కోరారు. శనివారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ శాఖపై సీఎం సమీక్షించారు. ముఖ్యమంత్రితోపాటు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్రంలోని రైతులందరూ మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసే సదస్సులో పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయంలో వచ్చిన అధునాతన సాగు పద్ధతులు, మెళకువలను రైతులకు తెలియజేసేలా వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, పశుసంవర్థక శాఖల అధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాట్లు చేయాలని సూచించారు. అధునాతన పరికరాలు, ఎలక్ట్రిక్ ట్రాక్టర్లు, డ్రోన్లు...అన్నింటినీ అక్కడ ప్రయోగాత్మక ప్రదర్శనకు సిద్ధంగా ఉంచాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం 23 లక్షల మంది రైతులకు ఇప్పటికే రూ.2 లక్షల రుణమాఫీ చేసిందని తెలిపారు. కొన్ని చోట్ల ఆధార్ నెంబర్ల తప్పులు, బ్యాంకు ఖాతాల్లో పేర్ల తప్పులు, కుటుంబాల నిర్ధారణ కారణాలతో కొందరికి రుణమాఫీ జరగలేదంటూ వచ్చిన ఫిర్యాదులపై అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి నివేదికను అందించారు. ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి. సీఎంవో స్పెషల్ సెక్రటరీ చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్ రావు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

భూగర్భ సంపుల నిర్మాణం పూర్తి చేయాలి

- పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దాన కిషోర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నిర్మాణంలో ఉన్న భూగర్భ సంపులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జిహెచ్ఎంఎ అధికారులను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దాన కిషోర్ ఆదేశించారు. హైదరాబాద్ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని రాజ్‌భవన్ రోడ్డులోని లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్ ప్రవేశ మార్గంలో భూగర్భ సంపు (రెయిన్ వాటర్ హెూల్డింగ్ స్ట్రక్చర్) నిర్మాణ పనుల పురోగతిని శనివారం హెచ్ఎండిఎ, జలమండలి, జిహెచ్ఎంసి అధికారులతో క్షేత్రస్థాయిలో కలిసి ఆయన పరిశీలించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 10 నుంచి 40 లక్షల లీటర్ల సామర్థ్యంతో ప్రయోగాత్మకంగా 12 చోట్ల భూగర్భ సంపుల నిర్మాణాలు చేపట్టామని, వీటిలో 4 పూర్తి అయ్యాయని జీహెచ్ఎంసీ అధికారులు ముఖ్య కార్యదర్శికి వివరించారు. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. వర్షపు నీటిని ఒడిసి పట్టడంతోపాటు రోడ్లపై నీరు నిల్వకుండా చూడటం, ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్‌పెట్టేందుకే భూగర్భ సంపులను నిర్మిస్తున్నట్టు దానకిశోర్ తెలిపారు. భూగర్భ సంపులను త్వరితగతిన పూర్తిచేయాలని, ట్యాంక్‌బండ్ పరిసరాలను అందంగా ముస్తాబు చేయాలని అధికారులను ఆదేశించారు. 'ప్రజాపాలన' ప్రజా విజయోత్సవం' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్ ట్యాంక్‌బండ్, సెక్రటేరియట్, నెక్లెస్‌రోడ్ పరిసరాల్లో విజయోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న దృష్ట్యా ఈ ప్రాంతాలను అనుసంధానం చేసే ప్రధాన మార్గాలను పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు.

IN THE COURT OF THE HONBLE PRINCIPAL DISTRICT JUDGE, ELURU, W.G.Dt.
Tr.O.P.No.17/2024
Between:
Vatsavai Venkata Rama Krishnarjuna Raju ...Petitioner
And
Pericherla Shivaji Raju and Others ...Respondents
To.
R-1: Pericherla Shivaji Raju, S/o.Venkata Krishnam Raju, R/o.D.No.19-54/8/23, Vinayaka Nagar, Narasapur Village and Mandal, Medak District, Telangana State.
పై నెంబరు Tr. O.P. గ్రంథములో శ్రీకోర్టు వారు 1వ రెస్పాండెంటు వారి హాజరు నిమిత్తం పలుమార్లు నోటీసులు ఆర్డరు వేసినప్పటికీ మీరు తీసుకొనక కాలయాపన చేసినందున మీ యొక్క హాజరు నిమిత్తం **ది.03-12-2024**వ తేదీన ఉదయం గం.10.30 ని॥లకు వాయిదా వేసియున్నారు. కావున మీరు స్వయంగా గానీ, ప్లీడరు గారి ద్వారా హాజరు కాని యెడల మీ పరోక్షమున పై నెంబరు Tr. O.P. గ్రంథము పరిష్కరింపబడునని తెలియచేయడమైనది.
//శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం//
G.V.Anand Kumar
Advocate, Eluru, W.G.Dt.
Cell:9848427001, 7989119214.

మహారాజశ్రీ మొవ్వ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.యస్ నెం. 216/2019
బిట్వీన్ :
సంద్ర శ్యామ్ సుందరరాజు ....వాది
మరియు
బుట్టి పున్నం రాజు .... ప్రతివాది
రెస్పాండెంటు / ప్రతివాది :-
బుట్టి పున్నంరాజు, తండ్రి : అప్పలరాజు, హిందువు, వ్యాపారం, నివాసం : యెదుగుల గూడెం, కుర్వి మండలం, వరంగల్‌జిల్లా, తెలంగాణా రాష్ట్రం.
మీపైన పై కోర్టులో డబ్బులు వసూలు నిమిత్తం ప్రామిశరీ నోటుపై దావా ఓ.యస్.నెం. 216/2019 మరియు ఐ.ఎ. నెం. 115/2019ను ఇళ్ళ స్థలమును జప్తు కొరకు మీపై దాఖలు చేయగా శ్రీ కోర్టువారు మీకు ఓ.యస్.నెం. 216/2019 సమన్లు నిమిత్తం మరియు ఐ.ఎ. 115/2019 అను పిటీషన్‌లో నోటీసులు నిమిత్తం ది. 29-11-2024వ తేదీకి వాయిదా అయివున్నది. సదరు ది. 29-11-2024వ తేదీన ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట దావాలోను మరియు పిటీషన్‌లోను మీరు స్వయంగా కానీ, లేదా న్యాయవాది ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకో గలరు. లేనియెడల దావాలో మరియు పిటీషన్‌లోను మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది : 29-11-2024
ఇట్లు
ఇమ్మడిశెట్టి లక్ష్మీనారాయణ,
న్యాయవాది, అవనిగడ్డ.
సెల్ : 9908160589.

మహారాజశ్రీ అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No:34/2012
ధర్మవరపు కుసుమకుమారి ...... వాది
Vs.
1.ధర్మవరపు వెంకటసుబ్బమ్మ (died) & ఇతరులు ...ప్రతివాదులు
ప్రకటన.
To
D9) సిహెచ్. ధనలక్ష్మి **W/o** కామేశ్వరరావు, టీచర్, హౌస్ నెంబర్ :7-421/1079, సంతోష్ నగర్, 8హౌసెస్ స్ట్రీట్ కాలనీ , రామగుండం, 505211, కరీంనగర్ జిల్లా, (old), పెద్దపల్లి జిల్లా (new) తెలంగాణా రాష్ట్రం.
పై దావాలో మీకు ఎన్నిసార్లు నోటీసులు/ సమన్లు పంపినప్పటికి మీరు దురుద్దేశ్యపూర్వకముగా తీసుకొనక తిరిగి పంపుచున్నందువలన మీకు పై దావాలో నోటీసును ఈ ప్రకటన ద్వారా కోర్టువారు జారీ చేసి మీ హాజరు నిమిత్తం ఈ దావా ను తేది 03-12-2024 నకు వాయిదా వేశారు. కావున మీరు ఆ తేదిన ఉదయం గం.10-30 ని.లకు పై కోర్టువారి ఏదుట స్వయముగాగాని వకీలు ద్వారాగాని హాజరయి పైదావాలో మీ ఆక్షేపణలను తెలియ జేయవలెను. లేని ఏడల పై దావాను మీ పరోక్షమందు తీర్మానించెదరని తెలియజేయడ మయినది.
వాయిదా తేది : 03-12-2024
// శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో //
వజ్రాల అంజిరెడ్డి,
మారం శ్రీనివాసరావు,
తాడికొండ ప్రసాద్ బాబు.
వాది తరుపు న్యాయవాదులు,
అద్దంకి

ఎరువుల పిడుగు

- 'యాసంగి' పై అదనపు బరువు
- బస్తాకు రూ.300 పెంపు
- రూ.1350 నుంచి రూ.1650కి పెరుగుదల
- రాష్ట్ర వ్యాప్తంగా డిఏపి భారం రూ.100 కోట్లు
- బ్లాక్ మార్కెట్‌లో వ్యాపారుల విక్రయాలు
- కేంద్రం వైఖరిపై అన్నదాతల ఆగ్రహం
- ఎరువుల ధరలు తగ్గించాలి రైతు సంఘం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆరుగాలం కష్టపడి పండించే పంటలకు గిట్టుబాటు ధర పెరగట్లేదు. కానీ..! ఎరువులు, డీజిల్ ఇతర వస్తువుల ధరలు మాత్రం ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్నాయి. యాసంగి సీజన్‌లో డిఎపి ధరలు విపరీతంగా పెరగడంతో అన్నదాతలపై భారాలు భారీగానే పడనున్నాయి. ఏటేటా సాగు వ్యయం పెరగడం వల్ల రైతులు నష్టాల పాలవుతున్న పరిస్థితి ఉంది. బస్తా డిఎపిపై రూ.300 ధర పెరగడంతో రైతులపై వందల కోట్ల భారం పడనుంది. మరో పక్క డిఎపి ఎరువుల ధరలు పెరగడంతో బ్లాక్ మార్కెట్ పెరిగింది. పాత సరుకును కొత్త ధరలకు అమ్ముతూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. యాసంగి సీజన్‌కు సరిపడ ఎరువుల్ని స్టాక్ చేయాల్సిన మార్క్‌ఫెడ్, వ్యవసాయ శాఖలు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నాయి.

యాసంగి సీజన్‌లో విశాఖ, అనురాధ కార్తెలు ముగిసేలోపు వరి నార్లు పోస్తారు. డిసెంబర్ 15 నుంచి వరి నాట్ల సీజన్ షురూ అవుతాయి. ఆరుతడి పంటలు సైతం ఇదే సమయంలో సాగవుతాయి. ఇప్పటికే బోర్లు, బావుల కింద సాగు చేసే వరి పంటలకు సంబంధించి నార్లు పోసే పనులు ప్రారంభమవ్వగా ఇతర మెట్ట పంటల సాగుకు దుక్కుల్ని సిద్ధం చేస్తున్నారు. యాసంగి సీజన్‌లో వరి, మొక్కజొన్న, కూరగాయలు, పండ్లతోటలు, చెరకు వంటి పంటల సాగులో ఎరువుల్ని వినియోగిస్తారు. అందులో డిఎపి ఎరువు వాడకం అధికంగా ఉంటుంది. సీజన్ ప్రారంభానికి ముందే డిఎపి ఎరువుల ధరలు పెరగడంతో రైతుల నెత్తిన పిడుగు పడినట్టయింది. ఇప్పటికే యాసంగి సీజన్ సాగు ప్రణాళికలను వ్యవసాయ శాఖ ప్రకటించింది. ఆయా పంటల వారీగా సాగు విస్తీర్ణానికి అవసరమైన విత్తనాలు, ఎరువుల్ని అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది.

యాసంగి ప్రణాళికలు

రాష్ట్ర వ్యాప్తంగా యాసంగి సీజన్‌లో వివిద రకాల పంటలు కలిపి 63.34 లక్షల ఎకరాల్లో సాగవ్వనున్నట్టు అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే 3.15 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగైనట్టు కూడా అధికారుల రికార్డుల్లో పేర్కొన్నారు. ఇందులో వరి పంట విస్తీర్ణమే అధికంగా ఉంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో సైతం వివిధ రకాల పంటలు కలిపి 8.35 లక్షల ఎకరాల్లో సాగవుతాయని అధికారులు అంచనా వేశారు. మెదక్ 3.33 లక్షల ఎకరాలు, సిద్దిపేట జిల్లాల్లో 3.20 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవ్వనున్నాయి. రెండు జిల్లాల్లో సాగునీటి వనరులు, బోర్ల ద్వారా నీటి లభ్యత ఉన్నందున వరి పంట సాగు అధికంగా ఉండనుంది. సంగారెడ్డి జిల్లాలో 1.82 లక్షల ఎకరాల్లో పంటలు సాగవ్వనున్నాయి. బోర్లు, సింగూరు ప్రాజెక్టు కింద నీటి లభ్యత ఉన్నందున వరి పంట 1.2 లక్షల ఎకరాల్లో సాగవ్వనుంది. ఇప్పటికే ఖరీఫ్ వరి కోతలు, ఇతర పంటలు చేతికొచ్చినందున రైతులు యాసంగి సీజన్ సాగు పనుల్లోకి దిగారు. వరి నార్ల కోసం దుక్కులు దున్ని విత్తనాలు సిద్ధం చేసుకుంటున్నారు.

డిఎపి బస్తాపై రూ.300 భారం

ఉన్నట్లుండి యాసంగి సీజన్‌కు ముందే డిఎపి ఎరువు బస్తా ధర ఏకంగా రూ.300 పెంచారు. ఇప్పటి వరకు డిఎపి బస్తా ధర రూ.1350 ఉండగా ప్రస్తుతం రూ.1650కి పెరిగింది. యాసంగి సీజన్‌లో వరి, పండ్ల తోటలు, ఇతర పంటల సాగు కోసం యూరియా, డిఎపి, కాంప్లెక్స్, సింగిల్ సూపర్ ఫాస్పేట్, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వంటి ఎరువులను వినియోగిస్తారు. రాష్ట్రంలో 1.50 లక్షల మెట్రిక్ టన్నుల వరకు డీఏపీ ఎరువుల్ని వివిధ పంటల సాగులో వినియోగిస్తారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో డిఎపి ఎరువు 20 వేల మెట్రిక్ టన్నుల వరకు వినియోగిస్తారు. మార్కెట్‌లో డిఎపి ధరలు విపరీతంగా పెరగడంతో డిఎపి బస్తా కొనాలంటే రైతులకు గుండె దడ పుడుతోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 4 లక్షల డిఎపి బస్తాలను వినియోగిస్తారు. ఆ లెక్కన బస్తాకు రూ.300 చొప్పున ఉమ్మడి మెదక్ జిల్లా రైతాంగంపై రూ.12 కోట్ల భారం మోపబడుతుంది. రాష్ట్రంలోనూ 30 లక్షల బస్తాల డీఏపీ వరకు వినియోగిస్తున్నారు. బస్తాకు రూ.300 చొప్పున భారం పడినందున రూ.90 కోట్ల వరకు రైతులు భరించాల్సి ఉంటుంది. సగటున రాష్ట్ర రైతాంగంపై కేవలం డీఏపీ ఎంపీఆర్ ధర ప్రకారం కొనుగోలు చేసినా రూ.100 కోట్ల వరకు అదనపు భారం పడుతుండడంతో యాసంగి సాగు కష్టకాలంగా మారనుంది.

మార్కెట్‌లో నిల్వల్లేవు... బ్లాక్ మార్కెటింగ్

యాసంగి సీజన్ పంటల సాగు పనులు జరుగుతున్నా మార్కెట్‌లో అవసరమైన ఎరువుల నిల్వలు కనిపిస్తలేవు. ఎరువులకు నోడల్ ఏజెన్సీగా వ్యవహరించే మార్క్‌ఫెడ్, వ్యవసాయ శాఖల ద్వారా ఎరువుల పంపిణీ చేస్తారు. ఫర్టిలైజర్ వ్యాపారులు, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు విక్రయిస్తారు. వాస్తవంగా యాసంగి సీజన్‌కు అవసరమైన ఎరువుల్ని ముందే బఫర్ స్టాక్ ఉంచాలి. ప్రస్తుతం నవంబర్‌లో 65 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ ఎరువుల్ని స్టాక్ నిల్వ ఉంచాల్సి ఉండగా ప్రస్తుతం 12 వేల మెట్రిక్ టన్నులు కూడా అందుబాటులో లేని పరిస్థితి ఉంది. దేశ వ్యాప్తంగా కూడా డీఏపీ కొరత నెలకొనడంతో రాష్ట్రంలోనూ అదే పరిస్థితి కనిపిస్తుంది. వాస్తవంగా అక్టోబర్‌లో 30 వేల మెట్రిక్ టన్నులు, నవంబర్‌లో 40 వేల మెట్రిక్ టన్నులు, డిసెంబర్‌లో 35 వేల, జనవరిలో 30 వేల మెట్రిక్ టన్నుల వరకు నిల్వలు ఉంచి రైతులకు కొరత లేకుండా చూడాల్సిన మార్క్‌ఫెడ్, వ్యవసాయ శాఖలు నిమ్మకు నీరెత్తినట్టు చూస్తున్నాయి. ఎరువుల వినియోగాన్ని బట్టి ముందే ఇండెంట్ పెట్టి స్టాక్ తెప్పించి స్థానికంగా ఏర్పాటు చేసిన రేక్ పాయింట్లలో నిల్వ ఉంచి స్థానిక అవసరాల్ని బట్టి పంపిణీ చేయాలి. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న కొద్దిపాటి నిల్వల్ని కూడా వ్యాపారులు బ్లాక్ చేసి పాత స్టాక్‌ను పెరిగిన ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. నిల్వలు లేక, ఉన్నా ధరలు పెరగడంతో రైతుకు డీఏపీ దొరకడమే గగనంగా మారుతోంది.

డిఎపి భారం మోపొద్దు: గొల్లపల్లి జయరాజు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు

డీఏపీ ధరలు పెరగడం వల్ల రైతులు నష్టపోనున్నారు. ఇప్పటికే సాగు వ్యయం విపరీతంగా పెరిగింది. డీజిల్, ఎరువులు, విత్తనాల ధరలు పెంచుతున్నారు. రైతులు పండించే పంటలకు మాత్రం కేంద్రం గిట్టుబాటు ధరల్ని ఖరారు చేసి మద్దతు ధరలుగా ప్రకటించడంలేదు. స్వామినాథన్ కమిషన్, ఇతర కమిషన్లు చేసిన సూచనలేవీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. పెంచిన డీఏపీ ఎరువు ధరల భారాన్ని రైతులపై వేయకుండా కేంద్రం భరించాలి. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టి రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలి.

సిపిఎం భూపాలపల్లి జిల్లా కార్యదర్శిగా బందు సాయిలు

- నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఎం భూపాలపల్లి జిల్లా కార్యదర్శిగా బందు సాయిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కృష్ణ కాలనీలోని సింగరేణి ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 21, 22 తేదీల్లో సిపిఎం జిల్లా 3వ మహాసభ జరిగింది. ఈ మహాసభకు కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు జె.వెంకటేష్ హాజరయ్యారు. గత మూడు సంవత్సరాల కాలంలో నిర్వహించిన పోరాటాలపై సమీక్షించారు. భవిష్యత్ కార్యాచరణ రూపొందించారు.

నూతన కమిటీ

మహా సభలో కార్యదర్శిగా రెండోసారి బందు సాయిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా చెన్నూరి రమేష్, పోలం రాజేందర్, గుర్రం దేవేందర్ ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా వెలిశెట్టి రాజయ్య, ఆత్కూరి శ్రీకాంత్, సంగం ప్రీతి, రజనీకాంత్, సూదుల శంకర్, పోలం చిన్న రాజేందర్, కుంజం బుదారం, ఆకుదారి రమేష్, వంగాల విజయలక్ష్మి, గడప శేఖర్ ఎన్నికయ్యారు.

రామాలయం మాడవీధుల అభివృద్ధికి రూ.70 కోట్లు

- మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

భద్రాచలం రామాలయ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, దీనిలో భాగంగా ఇప్పటికే రూ.70 కోట్లను మాడవీధుల అభివృద్ధి కోసం విడుదల చేసినట్టు రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారిని పొంగులేటి శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. మాడవీధుల అభివృద్ధికి సుమారు రెండు ఎకరాలకు పైగా భూమి కావాలని, ఇప్పటికే అధికారులు దానికి సంబంధించిన భూమిని గుర్తించినట్టు తెలిపారు. త్వరలోనే రామాలయం అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు. అనంతరం ఆలయ అధికారులతో కలిసి మాడవీధుల అభివృద్ధి పనులపై మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులం కూడా రామాలయం అభివృద్ధిలో ముందుంటామని చెప్పారు. రామాలయం మీద ప్రేమ ఉంది కనుకనే భద్రాచలంలో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించినట్టు గుర్తు చేశారు. ఆయన వెంట కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్, భద్రాచలం, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

గ్రామస్తులను విచారిస్తున్న కమిషన్ సభ్యులు

లగచర్లలో జాతీయ మానవ హక్కుల కమిషన్ విచారణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో కలెక్టర్‌పై జరిగిన దాడి ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ శనివారం విచారణ చేపట్టింది. స్థానిక గిరిజనులపై పోలీసులు దాడి చేసి, అక్రమంగా అరెస్టు చేశారని జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు అందడంతో విచారణ చేపట్టింది. ఇప్పటికే లగచర్ల దాడిపై రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని సిఎస్, డిజిపికి నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. విచారణలో భాగంగా శనివారం లా విభాగం డిప్యూటీ రిజిస్ట్రార్ ముఖేష్, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు రోహిత్‌సింగ్, ప్రకాశ్ శర్మ రోటిబండ తండాలో పర్యటించి, క్షేత్రస్థాయి దర్యాప్తు చేపట్టారు. వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ లగచర్ల గ్రామానికి వచ్చినప్పుడు ఏం జరిగింది, అధికారులపై దాడి, ఆ తర్వాత పోలీసులు అరెస్టు చేసిన తీరును కమిషన్ సభ్యులు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. పోలీసులు తమపై చేసిన దౌర్జన్యాలను స్థానికులు వివరించారు.

అర్ధరాత్రి తమ ఇళ్లలోకి చొరబడి పోలీసులు తమ వాళ్లను అరెస్టు చేసి జైలుకు తరలించారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా నిలిపి వేసి మహిళలతో అసభ్యంగా ప్రవర్తించారని కమిషన్ సభ్యుల ఎదుట వాపోయారు. పోలీసులు ఇళ్లకు వచ్చినప్పుడు మహిళా పోలీసులు ఉన్నారా, అరెస్టు చేసిన వారిని కొట్టారా.. అనే అంశాలపై కమిషన్ అధికారులు ఆరా తీశారు. కలెక్టర్ వచ్చిన రోజు పోలీసులు తమపై కూడా దాడి చేశారని, ఇంకా ఆ దెబ్బలకు నొప్పులతో బాధపడుతున్నామని స్థానికులు కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. తమకు న్యాయం చేయాలని కమిషన్ సభ్యులను కోరారు. బాధితులను ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించాలని ఎఎన్‌ఎంను కమిషన్ సభ్యులు ఆదేశించారు. ఆదివారం కూడా విచారణ కొనసాగే అవకాశాలున్నట్టు సమాచారం. మరోవైపు లగచర్ల ఘటనపై సీఎస్, డీజీపీని రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని ఎన్‌హెచ్‌ఆర్సీ ఆదేశించింది. నివేదికలో ఎఫ్‌ఐఆర్‌ల స్థితి, న్యాయ కస్టడీలో ఉన్న వ్యక్తుల వివరాలు, భయంతో అడవుల్లో దాక్కున్న గ్రామస్తుల వివరాలు ఉండే విధంగా చూడాలని సూచించింది.

విద్యార్థి ఆత్మహత్య

- మియాపూర్‌లోని ఓ కార్పొరేట్ కాలేజీలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా మియాపూర్‌లోని ఓ కార్పొరేట్ కాలేజీలో ఇంటర్‌మీడియట్ విద్యార్థి తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. షాద్‌నగర్‌కు చెందిన కౌశిక్ రాఘవ(17) మియాపూర్‌లోని ఓ కార్పొరేట్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. అతను చదువుల్లో ఎప్పుడూ ముందు ఉండేవాడు. ఇటీవల తీవ్ర ఒత్తిడికి గురయ్యాడు. ఈ క్రమంలోనే హాస్టల్‌లోని తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నారు. తన కొడుకు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని, అతని మృతిపై అనుమానాలు ఉన్నాయని విద్యార్థి తల్లి ఆరోపించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హైదరాబాద్‌లో 'స్టెల్లార్ రిజర్వ్' కేఫ్ ఏర్పాటు

- దేశంలోనే తొలి నైట్రో కాఫీ బార్

ప్రజాశక్తి - హైదరాబాద్

దేశంలోనే తొలిసారి హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో నైట్రో కాఫీ బార్ అండ్ ఫైన్ డైనింగ్ అయినా స్టెల్లార్ రిజర్వ్ కేఫ్‌ను ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ తెలిపింది. నగరంలోని కేఫ్ సంస్కృతికి మరిన్ని వినూత్న రుచులకు కేంద్రంగా నిలువనుందని పేర్కొంది. అత్యాధునిక సాంకేతికత, కళాత్మక రుచులు, ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధమైన వంటకాల విభిన్న మెనూలతోపాటు, దేశంలోని కాఫీ సంస్కృతిని స్టెల్లార్ రిజర్వ్ కొత్తగా నిర్వహించనుందని తెలిపింది. మార్జోకో బ్రాండ్ ద్వారా తయారు చేసిన "స్ట్రాడా ఎక్స్" అనే అధునాతన ఎస్ప్రెస్సో యంత్రాలను ఉపయోగిస్తున్నట్లు పేర్కొంది. ఈ యంత్రం గరిష్టంగా రోజుకు 500 షాట్లను ఉత్పత్తి చేస్తుందని పేర్కొంది. కాఫీతో పాటు అనేక అహారోత్పత్తులు అందుబాటులో ఉంటాయని పేర్కొంది.

స్కాలర్‌షిప్ అవకాశాలపై అవగాహన

- నారాయణమ్మ ఇన్‌స్టిట్యూషన్‌లో నిర్వహణ

ప్రజాశక్తి - హైదరాబాద్

స్కాలర్‌షిప్‌లు పొందడంపై కళాశాల విద్యార్థులకు అవగాహన పెంచడానికి తాము ఎరుడైట్ హర్ స్కాలర్‌షిప్ ఎడిషన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు జి నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ ఫర్ ఉమెన్ స్టూడెంట్ క్లబ్ తెలిపింది. శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు కొత్త అవకాశాలపై అవగాహన పెంచుకుని భవిష్యత్ స్కాలర్‌షిప్‌నకు అర్హులుగా తీర్చిదిద్దడానికి దోహదం చేసిందని పేర్కొంది. క్లబ్ ఫ్యాకల్టీ, కన్వీనర్లు డాక్టర్ ఎం.అపర్ణ, డాక్టర్ ఆర్ లక్ష్మీ, హెచ్‌అండ్‌ఎం విభాగం క్లబ్ సభ్యులతో ప్యానెల్ డిస్కషన్ నిర్వహించినట్లు పేర్కొంది. ఈ కార్యక్రమానికి విద్యార్థి సంఘం నుంచి మంచి ఆదరణ లభించిందని తెలిపింది. క్యాంపస్‌లోని అన్ని శాఖల్లోని 200 పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని పేర్కొంది. స్థూలంగా ఎరుడైట్ హర్ స్కాలర్ షిప్ ఎడిషన్ ఈవెంట్ విజయవంతం అయ్యిందని.. ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని క్లబ్ భావిస్తోందని నిర్వాహకులు తెలిపారు.

రేవంత్ అసత్యాలను మహారాష్ట్ర ప్రజలు నమ్మలేదు

- రానున్నది ప్రాంతీయ పార్టీల శకం : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసత్య ప్రచారాలను మహారాష్ట్ర ప్రజలు నమ్మలేదని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీలు అమలు చేయకుండానే అన్ని చేసినట్టుగా దొంగ ప్రచారానికి మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందని చెప్పారు. తెలంగాణ ప్రజలకు చెందిన రూ.300 కోట్ల సొమ్ముతో పెద్ద ఎత్తున ప్రకటనలు ఇచ్చి మహారాష్ట్రలో తిమ్మిని బమ్మిని చేద్దామనుకున్న రేవంత్ ఆటలు సాగలేదని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో ప్రతి మహిళకు రూ.2500 ఇస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చకుండానే మహారాష్ట్రలో మహిళలకు రూ.3000 రూపాయలు ఇస్తామని చెప్పడాన్ని ఆయన తపుప పట్టారు. ఎన్నికల ప్రచారంలో అదానీని గజదొంగగా అభివర్ణించి తెలంగాణలో మాత్రం వ్యాపార, వాణిజ్య సంబంధాలు పెట్టుకున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని కేటీఆర్ అన్నారు. ఇకనైనా ముఖ్యమంత్రి పదవికి న్యాయం చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసే దిశగా పని చేయాలని సీఎంకు సలహా ఇచ్చారు.

ప్రాంతీయ పార్టీల పొత్తుతోనే బిజెపి గెలుపు

మహారాష్ట్రలో బిజెపి గెలిచేందుకు ప్రాంతీయ పార్టీ నేతలు ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్‌లే కీలకమయ్యారని కెటిఆర్ అన్నారు. ప్రాంతీయ పార్టీల ప్రాధాన్యత పెరగడం దేశ సమాఖ్య స్ఫూర్తికి, రాష్ట్రాల అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు.

భవిష్యత్తులోనూ కెసిఆర్ లాంటి బలమైన ప్రాంతీయ నాయకులను ప్రజలు ఆశీర్వదిస్తారని గుర్తు చేశారు. 2024 లోక్ సభ ఎన్నికల ఫలితాల నాటి నుంచే దేశంలో సంకీర్ణ శకం మొదలైందని అన్నారు. భవిష్యత్ లోనూ ఇదే ట్రెండ్ కొనసాగటం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు.. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బిజెపి సొంతంగా ఏ రాష్ట్రంలో కూడా ప్రభుత్వాలు ఏర్పాటు చేసే పరిస్థితిలో లేవన్నారు. మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలు బిజెపి, కాంగ్రెస్ రెండు పార్టీలకు చెంప పెట్టని వ్యాఖ్యానించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

హైదరాబాద్ తాగునీటికి గోదావరి జలాలు

- 20 టిఎంసిల తరలింపుపై సిఎం సమీక్ష

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం గోదావరి జలాలను వాడుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 20 టిఎంసిల తరలింపుపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష చేశారు. శనివారం జూబ్లీహిల్స్ నివాసంలో సమావేశమైన జలమండలి, ఇరిగేషన్ ఉన్నతాధికారులు సిఎంతో భేటి అయ్యారు. హైదరాబాద్ ప్రజల తాగునీటి అవసరాలకు సంబంధించి సుదీర్ఘ చర్చ జరిగింది. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ కొండపోచమ్మ, మల్లన్నసాగర్ ప్రాజెక్టుల నుంచి నీటి తరలింపుపై సమగ్ర నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఏ ప్రాజెక్టు నుంచి నీటి తరలింపునకు ఎంత వ్యయం అవుతుంది, నీటి లభ్యతపై పూర్తి అధ్యయనం చేయాలని సూచించారు. డిసెంబరు ఒకటో తేదీ వరకు టెండర్లకు వెళ్లేలా కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. ఈ మేరకు మిషన్ భగీరథ అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ఈ సమీక్షలో పట్టణ, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి బి దానకిషోర్, జలమండలి ఎండి అశోక్‌రెడ్డి, సాగునీటి శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను చెరుకు సాగుకు దూరం చేస్తున్న ప్రభుత్వాలు

- గిట్టుబాటుకాని ధరలు
- పంట టన్నుకు రూ.500 బోనస్ చెల్లించాలి
- చెరుకు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు
- సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నిక

సదస్సులో మాట్లాడుతున్న బొంతు రాంబాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరుకు పంటకు ధర కల్పించకుండా.. సాగును నిర్వీర్యం చేస్తున్నాయని చెరుకు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం మోటాపురం, మల్లేపల్లి గ్రామాల మధ్యగల బికెఆర్ గార్డెన్‌లో శనివారం చెరుకు రైతు రాష్ట్ర సదస్సు రచ్చ నరసింహారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరుకు రైతుల పట్ల ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, దాంతో సాగుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత చెరుకు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు. చెరుకు రికవరీ పేరుతో మద్దతు ధరలు తగ్గించి రైతులను దగా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలోనూ కొన్ని పంటలకు బోనస్‌లు ప్రకటించిన సిఎం రేవంత్ రెడ్డి చెరుకు పంటకు బోనస్ ప్రకటించకుండా వివక్ష చూపిస్తున్నారన్నారు. ఖమ్మం జిల్లాలో చెరుకు సాగుకు అనుకూలమైన నేలలు అధికంగా ఉన్నాయన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లాలో అననుకూలమైన భూముల్లోనూ ఫామ్ ఆయిల్ సాగుకు ప్రోత్సాహకాల పేరుతో పురమాయించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికే జిల్లాలో సాగు చేసిన అనేక మంది పామాయిల్ రైతులు ఏండ్లు గడుస్తున్నా దిగుబడులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలో చెరుకు సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు అవసరమైన పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చెరుకు మిల్లులు, పరిశోధన సంస్థల భాగస్వామ్యంతో సస్యరక్షణ చర్యలకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలని, చీడపీడలను తట్టుకునే నూతన వంగడాలను రూపొందించి రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు సహకరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం.. చెరుకు టన్నుకు 4 వేల రూపాయలు ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చెక్కర ముసాయిదా(నియంత్రణ) ఆర్డర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని, నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని డిమాండ్ చేశారు.

చెరుకు రైతుల సంఘం రాష్ట్ర నాయకులు శోభన్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా చెరుకు సాగు చేసి తీపిని పంచుతున్న రైతన్నలకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చేదును చవిచూపిస్తోందన్నారు. మోడీ అనుసరిస్తున్న అసమర్థ విధానాల ఫలితంగా దేశవ్యాప్తంగా అనేక చక్కెర ఫ్యాక్టరీలు మూతపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చక్కెర నూతన పాలసీ పేరుతో చెరుకు రైతులను సాగుకు దూరం చేసి.. విదేశాల నుంచి చక్కెర, బెల్లం దిగుమతి చేసుకునేలా మోడీ కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ప్రధాని మోడీ చెప్పిన విధంగా 9.5 శాతం చెరుకు రికవరీపై టన్నుకి రూ.5500 ఇవ్వాల్సి ఉన్నా అమలు చేయడం లేదన్నారు. ఫ్యాక్టరీకి చెరుకు తరలించిన 14 రోజుల్లో రైతుల ఖాతాలో డబ్బులు జమ కావాల్సి ఉన్నా సకాలంలో అందడం లేదన్నారు. ప్రభుత్వాలనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై రైతులంతా సంఘటితమై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ మాట్లాడారు. సదస్సులో చెరుకు రైతుల సంఘం, తెలంగాణ రైతు సంఘం నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, మల్లెల సన్మంతరావు, బిక్కసాని గంగాధర్ పాల్గొన్నారు.

చెరుకు రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నిక

ఈ సందర్భంగా చెరుకు రైతుల సంఘం రాష్ట్ర నూతన కమిటీని 12 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా జిఎస్ గోపి(వనపర్తి జిల్లా), బొంతు రాంబాబు(ఖమ్మం జిల్లా)తో పాటు సభ్యులుగా రచ్చ నరహారావు, పి.తోటకూరి రాజశేఖర్ (రాజు), విజయపాల్ రెడ్డి, డి.మోతీరాం నాయక్, ఎం.గంగాధర్, ఇమ్మడి సుదీర్, యలమద్ది లెనిన్, రాసాల కనకయ్యను ఎన్నుకున్నారు.

నకిలీ వైద్యుల గుట్టురట్టు

- 20 క్లినిక్‌లపై తెలంగాణ వైద్యమండలి దాడి
- చంపాపేట, కర్మన్‌ఘాట్, సైదాబాద్ ప్రాంతాల్లో తనిఖీలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పది మంది నకిలీ వైద్యుల గుట్టును తెలంగాణ వైద్య మండలి రట్టు చేసింది. హైదరాబాద్‌లోని చంపాపేట, సైదాబాద్, కర్మన్‌ఘాట్ ప్రాంతాల్లో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్ నేతృత్వంలో డాక్టర్ ఇమ్రాన్ అలీ, డాక్టర్ రాజీవ్‌తో కూడిన బృందం తనిఖీలు నిర్వహించింది. క్లినిక్‌లు, ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు కలిపి 20 సెంటర్లలో తనిఖీ చేసి 10 మంది నకిలీ వైద్యులను పట్టుకున్నట్టు తెలంగాణ వైద్యమండలి ప్రకటించింది. ఈ పది మంది నకిలీ వైద్యులు ఫస్ట్ ఎయిడ్ సెంటర్లలో నిబంధనలకు విరుద్ధంగా బెడ్స్ ఏర్పాటు చేయడంతోపాటు, సెలైన్స్ పెట్టడం, యాంటీ బయోటిక్స్, స్టెరాయిడ్స్ ఇంజెక్షన్స్ ఇస్తున్నట్టు గుర్తించారు. తగు ఆధారాలు సేకరించి వీరిపై ఎన్‌ఎంసి యాక్ట్ 34, 54 ప్రకారం కేసులు నమోదు చేయనున్నట్టు వైద్య మండలి వైస్ చైర్మన్ తెలిపారు. మహిళా ఆయుర్వేదిక్ వైద్యులు డాక్టర్ రాధా కుమారి గర్భిణులకు పరీక్షలు నిర్వహించడంతోపాటు నిబంధనలకు విరుద్ధంగా అల్లోపతి మందులు ఇస్తున్నట్టు తేలింది. ఆయుర్వేదిక్ వైద్యులు డాక్టర్ రమేష్, డాక్టర్ వీరేష్ హైడోస్ యాంటి బయోటిక్, స్టెరాయిడ్స్‌తోపాటు ఇతర అల్లోపతి మందులు ఇస్తునట్టు గుర్తించామని, వీరిపై ఆయుష్ కౌన్సిల్‌కి ఫిర్యాదు చేయడంతోపాటు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారికి ఫిర్యాదు చేయనున్నట్టు టిజిఎంసి సభ్యులు డాక్టర్ ఇమ్రాన్ అలీ తెలిపారు.

350 ఎఫ్ఐఆర్ నమోదు

నకిలీ వైద్యులైన ఆర్‌ఎంపి, పిఎంపిలపై ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 350 వరకు ఎఫ్ఐఆర్ ఫైల్ చేశామని, కొన్ని చార్జ్‌షీట్‌లు కూడా ఫైల్ అయ్యి త్వరలోనే కోర్టుకు వెళ్లనున్నట్టు టిజిఎంసి వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. నకిలీ వైద్యుల వల్ల జరిగే నష్టాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ఇన్నేండ్లు వీరి వల్ల జరిగిన, జరగబోయే నష్టాలను కోర్టు ముందు డాకుమెంట్స్ ద్వారా ఆధారాలతో సమర్పించనున్నట్టు తెలిపారు. నకిలీ వైద్య వ్యవస్థ పూర్తి స్థాయిలో పోయే విధంగా మరిన్ని చర్యలు తీసుకోనున్నట్టు చెప్పారు.



తనిఖీలు చేస్తున్న వైద్యాధికారులు

'కలనరీ'లో క్రిస్మస్ వేడుకల సందడి

ప్రజాశక్తి - హైదరాబాద్

నగరంలో క్రిస్మస్ పండగ సందడి మొదలైంది. ఇందులో భాగంగా హైదరాబాద్ బేగంపేటలోని కలనరి హోటల్ మేనేజ్‌మెంట్ ఇండియా కేక్ మిక్సింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. వివిధ రకాలైన 55 కిలోల డ్రై ఫ్రూట్స్‌లను మిక్స్ చేశారు. ఇందులో ఆల్కహాల్ కలుపుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు. నెల రోజులపాటు వీటిని ఉంచి క్రిస్మస్ ముందు తర్వాత వీటిని కష్టమర్లకు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.